సాగునీటి సౌకర్యం కల్పించే దిశగా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమ, మిడ్‌మానేరు, దేవాదుల, భక్తరామదాసు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సింహభాగం పూర్తయ్యింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువలు పునరుజ్జీవం పొందాయి. మొత్తంగా తెలంగాణ కలగన్న జలవిప్లవం చేరుకోవటానికి తుది అంకంలో నిలిచింది. 'తుంపర్ల సేద్యం.. తుప్పిర్ల సేద్యమేనా' అని దిగులుపడ్డ తెలంగాణలో మండువేసవిలో కూడా సముద్ర దృశ్యాలను కండ్ల ముందర సాక్షాత్కరింపజేసింది కేసీఆర్ సర్కారు. కానీ, ఇవాళ వ్యక్తి మీద పగతో వ్యవస్థకు శాపం పెట్టాలనే ఆలోచన రావడం ఏ విధంగా సరైంది? ఒకవేళ తెలంగాణ జలస్వప్నం నిజరూపం దాల్చకపోతే 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఎలా సాధ్యమైంది?

### కరెంటు కష్టాలకు ముకుతాడు

పూర్వ హైదరాబాద్ రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు వరంగల్‌లో ఆజంజాహీ మిల్లు, ఆదిలాబాద్‌లో సర్‌సిల్క్ ఫ్యాక్టరీ, సిర్పూర్ పేపర్‌మిల్లు మొదలుకొని చెరుకు పండించే రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకే రైలుపట్టాలు వేయించుకున్న సాహసికుల చరిత్ర ఉమ్మడి రాష్ట్రంలో ఎలా మసకబారిందో అర్థం చేసుకుంటే కానీ తెలంగాణ పునరావిష్కరణ... పునర్నిర్మాణం అర్థం కాదు. రాష్ట్రంలో నడుస్తున్న చిన్నా, పెద్ద పరిశ్రమలకు నిర్విఘ్నంగా కొనసాగే భరోసా ఇవ్వాలి.. కొత్త పరిశ్రమలను నెలకొల్పాలి. ఈ రెండూ పదేండ్ల కిందట జటిలమైన అంశాలు. అది.. పరిశ్రమలకు పవర్‌హాలిడేలు కొనసాగుతున్న కాలం, 'మాకు కరెంట్ కావాలి' అని పారిశ్రామికవేత్తలు, కార్మికులు కలిసి నిరసన తెలుపుతున్న కాలం. దీంతో కేసీఆర్ సర్కార్ రోజులో కనురెప్పపాటు కూడా కరెంట్ పోకూడదనే వజ్రసంకల్పం చేసుకున్నది. కొన్ని రోజుల్లోనే దాన్ని నిజం చేసింది కూడా. ఇక పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటై... ఇక్కడి యువశక్తికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం టీఎస్ ఐపాస్ పేరుతో కొత్త పారిశ్రామిక విధానాన్ని ముందుకుతెచ్చింది. ఇది పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం అని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు గ్రహించేలా చేసింది. అలా పదేండ్లు గడిచేసరికి హైదరాబాద్ ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఐటీ కంపెనీలు, వందలాది స్టార్టప్స్‌కు వేదికగా మారిపోయింది. రాష్ట్ర రాజధాని, దానిచుట్టూనే పరిశ్రమలు కేంద్రీకృతం కావాలనే ఆలోచనకు చరమగీతం పాడటం వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర ద్వితీయ శ్రేణి నగరాలకూ పారిశ్రామిక ప్రగతి విస్తరించింది. ఫలితంగానే 2014లో రూ.57,258 కోట్ల విలువ ఉన్న తెలంగాణ ఐటీ ఎగుమతులు 2022-23 నాటికి రూ.2,41,275 కోట్లకు చేరింది.







### వికేంద్రీకరణం... వికాస తరంగం

'చిన్న కుటుంబం..చింతలు లేని కుటుంబం' కుటుంబ నియంత్రణ కోసం పుట్టిన నినాదమే అయినా అది పాలనకూ వర్తిస్తుందని పదేండ్ల తెలంగాణ నిరూపించింది. వెనుకబాటుతనానికి మూలకారణమైన అనేకానేక కొలమానాల్లో జిల్లాలు భౌగోళికంగా పెద్దగా ఉండటం ఒక కారణమని ఛత్తీస్‌గఢ్ అనుభవం నేర్పిన పాఠం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత బస్తర్‌ను ఏడు జిల్లాలుగా విభజించారు. పోతే అక్కడ జిల్లాల







## అమరులకు అపురూప నీరాజనం



తెలంగాణ రాష్ట్రం నిజరూపం దాల్చటానికి... దశాబ్దాలుగా తెలంగాణ అస్తిత్వ, ఆత్మగౌరవ ఆకాంక్షల దీపం ఆరిపోకుండా ఉండటానికి 1952 నుంచి 1969 మీదుగా తుదిదశ పోరాటం వరకు వందలాది మంది విద్యార్థులు, యువకులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. తమ ఇండ్లను చీకటి చేసుకొని మనకు వెలుగు దివిటీలుగా నిలిచిపోయారు. తొలి దశ పోరులో ఆత్మ బలిదానాలు చేసుకొన్నవారు నిత్యం మనలో స్ఫూర్తిని రగిలించటానికి అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్‌లో నిర్మించిన అమరవీరుల స్థూపానికి ఎక్కా యాదగిరిరావు రూపకల్పన చేశారు. ఉమ్మడి పది జిల్లాల వీరులకు భవిష్యత్తులో నివాళి అర్పిస్తారో లేదో అనే అనుమానంతో నిత్య నివాళిగా పాలరాతి పుష్పాన్ని స్థూపంలో అమర్చారు. అనుమానించినట్టుగానే ఆ స్థూపం ఆవిష్కరణకు ఉమ్మడిపాలకులకు మనసు రాలేదు, సరికదా ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు సైతం కనీసం నివాళి అర్పించకుండా ప్రారంభమైన మూడో అసెంబ్లీ సమావేశాల సాక్షిగా నిర్లక్ష్య వైఖరిని కొనసాగించింది. ఇలా ఉంటే, తెలంగాణ అస్తిత్వపతాక భవిష్యత్తు తరాలకు సాక్షీభూతంగా నిలవాలనే మహదాశయంతో రాష్ట్ర నూతన సచివాలయం ఎదురుగా కేసీఆర్ సర్కారు అమరవీరుల జ్యోతిని నిర్మించి ఆ త్యాగధనులకు అంకితం చేసింది. అమరవీరులకు గౌరవం మాత్రమే కాదు... చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న, కుమ్రంభీం వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించే సంస్కృతికి శ్రీకారం చుట్టింది. మరోవైపు తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్, ప్రజాకవి కాళోజీ, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, మాజీ ప్రధాని, భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావు జయంతులను ప్రభుత్వమే జరిపించటం మొదలుపెట్టింది. ఇక్కడితో ఆగకుండా విశ్వవిద్యాలయాలకు వారి పేర్లను పెట్టి తెలంగాణ పెద్దలను గౌరవించుకున్నది.